నమస్తే తెలంగాణ





పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న యువకులు

## టాస్క్ సీవో సుంకిరెడ్డి కలిసిన యువకులు

చారకొండ, సెప్టెంబర్ 19 : టాస్క్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా నియమితులైన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని నెమలిగుట్టతండాకు చెందిన యువకులు అశోక్ రాథోడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఊర్కొండ, సెప్టెంబర్ 19 : మండలంలోని ఊర్కొండపేట గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం స్థలాన్ని గురువారం ఆర్ఐ రాఘవేందర్ సర్వేయర్ శ్రీదేవి పరిశీలించారు. గ్రామంలో కురువ గుట్ట వెనుకాల సర్వే నెంబర్ 345లో స్థలాన్ని గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథుడి నిమజ్జనం



చారకొండలో గణనాథుడికి నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

చారకొండ, సెప్టెంబర్ 19 : మండలంలో గణనాథులను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో గణనాథుడికి ఊరేగింపు నిర్వహించి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నేత చండీశ్వర్, యువకులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమం

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 19 : పెద్దకొత్తపల్లిలోని శివుని మాన్యంలో గణేశ్ యువక బృందం ఆధ్వర్యంలో గురువారం అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యువక బృందం సభ్యులు పట్టణంలో శోభయాత్ర చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామ సమీపంలోని చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేశారు.

# ఆలయాల్లో కులవివక్ష ఎందుకు?

- ప్రజలకు చెప్పాల్సిన అధికారులే అడ్డుకుంటారా
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



మక్తల్ ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిటీ చైర్మన్ బక్కి వెంకటయ్య

మక్తల్/మాగనూరు, సెప్టెంబర్ 19 : ప్రభుత్వ ఉద్యోగి అయ్యుండి సభ్యసమాజం తలదించుకునేలా చక్రపాణి వ్యవహరించడం సరికాదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. కృష్ణ మండలం ముడుమల్ రాఘవేంద్రస్వామి ఆలయంలో దళితుడైన ఓబులేష్ పెండ్లిని అడ్డుకున్న ఘటనపై గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బృందంతో కలిసి గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మక్తల్ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి ఆలయం వద్ద దళితులకు ఆలయ ప్రవేశం ఉందని బోర్డులు ఏర్పాటు చేయాలని కమిటీ ద్వారా అధికారులకు విన్నవిస్తామన్నారు. కుల వివక్షతతో దళితుడి పెండ్లిని అడ్డుకున్న చక్రపాణిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని వేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. అంతేకాకుండా చక్రపాణి జీతభత్యాలను మొత్తం రికవరీ చేయాలని కలెక్టర్‌కు చెప్పడం జరిగిందన్నారు. భూ సంస్కరణల చట్టానికి విరుద్ధంగా 100 ఎకరాల భూమి ఉన్నట్లు చక్రపానిపై ఫిర్యాదులు ఉన్నాయని, విచారణ చేపట్టి భూమిలేని నిర్వాసితులకు ఆ భూమిని పంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజలకు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులను నీరుగార్చకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో మదన్మోహన్, కమిటీ సభ్యుడు శంకర్‌తో పాటు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు



మిషన్ భగీరథ లీకేజీ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చారకొండ, సెప్టెంబర్ 19 : మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా అవుతుంది. ఈనెల 16వ తేదీన 'మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ పట్టించుకోని అధికారులు' అనే శీర్షిక నమస్తే తెలంగాణలో ప్రచురణ అయింది. గురువారం మిషన్ భగీరథ ఏఈ రితీశ్ స్పందించి పైపులైన్ లీకేజీ మరమ్మతుకు చర్యలు తీసుకున్నారు. దీంతో మర్రిపల్లి, మర్రిపల్లితండాలకు నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా పునఃప్రారంభించారు. మిషన్ భగీరథ సూపర్‌వైజర్ వినోద్, లైన్‌మెన్లు సేవనాయక్, సుమన్‌నాయక్ ఉన్నారు.

## చిరుత సంచారం

జడ్చర్ల, సెప్టెంబర్ 19 : జడ్చర్ల మున్సిపాలిటీలోని ఎర్రగుట్ట ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి చిరుతపులి సంచరించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన వీడియో వచ్చింది. చిరుత చీకట్లో నడుచుకుంటు వెళ్లింది కాని ఎవరికి ఎలాంటి హానీ కలిగించక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి వెళ్లి చుడగా చిరుతకు సంబంధించిన పాదముద్రలు లేకపోవడంతో చిరుతను పోలిన జంతువు ఏదో వచ్చింటుందని, మరలా వస్తే సమాచారం ఇవ్వాలని కాలనీవాసులకు సూచించారు. చిరుత సంచరిస్తుందన్న వార్తతో పట్టణ వాసులు భయాందోళనలో ఉన్నారు.

## పోలీసుల పహారాలో పేట



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఎస్పీలు

నారాయణపేట, సెప్టెంబర్ 19 : పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణ నేపథ్యంలో గురువారం పోలీసు అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మిలాద్-ఉన్-నబీ ర్యాలీ సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మసీదులు, ఆలయాలు, ప్రధాన చౌరస్తాలతో పాటు మిగతా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ప్రజలకు భద్రతపై భరోసాను కల్పించడంలో భాగంగా పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పేట ఎస్పీ యోగేశ్‌గౌతమ్, నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ బందోబస్తును పర్యవేక్షించారు. శుక్రవారం కూడా పట్టణంలో పోలీస్ పికెట్ కొనసాగనుంది.

## సబ్సిడీపై చేపపిల్లలను పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

లింగాల, సెప్టెంబర్ 19 : మత్స్యకారుల సంక్షేమాభివృద్ధి కోసం ప్రభుత్వం సబ్సిడీలపై చేపపిల్లలను పంపిణీ చేయాలని డీఎఫ్‌పీఎస్ చైర్మన్ ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రాయవరం గ్రామ శివారులో ఉన్న ఎల్లాసాయికుంట, దావుకుంట, పెద్దకుంటలలో సొంత ఖర్చుతో చేపపిల్లలను వదిలారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సొసైటీలను ఏర్పాటు చేసి చేపపిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చేపపిల్లలను పంపిణీ చేసి మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటయ్య, లింగాల, బల్మూర్ సొసైటీ అధ్యక్షుడు సైదులు, కేశవులు, ఉపాధ్యక్షుడు సలేశ్వరం, సభ్యులు సత్యం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

నవాబ్‌పేట, సెప్టెంబర్19 : మండలంలోని కిషన్‌గూడ గ్రామానికి చెందిన కలిమి మంజుల, ఆమె భర్త బాలయ్యపై దాడి చేసిన అంజయ్య అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రయ్ తెలిపారు. వివరాలోకి వెళ్తే..గ్రామానికి చెందిన మంజుల ఆమె మరిది అంజయ్య ఈనెల 16వ తేదీన భాగపరిష్కారం విషయంలో గొడవ పడగా.. అంజయ్య అతడి కుమారులు రాము, లక్ష్మణ్, భార్య శోభ దాడి చేసినందుకు గాను కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

## ప్రభుత్వ దవాఖానలోనే కాన్పులు జరగాలి

కల్వకుర్తి, సెప్టెంబర్ 19 : ప్రతి కాన్పు ప్రభుత్వ దవాఖానలోనే జరిగే విధంగా ప్రసవ ప్రణాళిక తయారు చేయాలని జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి లక్ష్మణ్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం కల్వకుర్తిలో డివిజన్ స్థాయి వైద్యాధికారులు, పర్యవేక్షణ అధికారులు, వైద్య సిబ్బందితో డాక్టర్ లక్ష్మణ్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలు అవుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైరిస్క్ గర్భిణులను తప్పనిసరిగా ప్రాంతీయ దవాఖానలకు పంపించాలని చెప్పారు. ఓపీ సేవలు, రికార్డు, ల్యాబ్ రిపోర్టులను ఎప్పటికప్పుడు జిల్లా ఉప వైద్యాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు రజిత, శరత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఏపీవో నిరంజన్, డీపీహెచ్ఎన్‌వో మంగమ్మ, పీహెచ్ఎన్ పుష్ప, సూపర్‌వైజర్లు ప్రమోద్, శ్రీనివాసులు, బాలాజీ, వెంకటేశ్, యశోద, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

లింగాల, సెప్టెంబర్ 19 : శానిటేషన్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీలోని సందర్శించి శానిటేషన్ వర్కర్లుతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సీహెచ్‌సీలో 14మంది కార్మికులు పని చేస్తుండగా వారికి ఏడు నెలలుగా వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ ఏజెన్సీ వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారి శివశంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు కవిరామ్, సభ్యులు శ్రీకాంత్, భగవంత్, కార్మికులు పాల్గొన్నారు.

## తాసీల్దార్‌కు సన్మానం



తాసీల్దార్ ను సన్మానిస్తున్న నాయకులు

వంగూరు, సెప్టెంబర్ 19 : వంగూరు తాసీల్దార్‌గా నూతనంగా వచ్చిన మురళీమోహన్‌ను గురువారం జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లాలూయాదవ్, వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడు కుమార్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీ సర్పంచ్ పుల్లయ్యయాదవ్, నాయకులు జగపతిరావు, శ్రీశైలంయాదవ్ ఉన్నారు.

## ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం


### రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.

వాణిజ్య

# టప్పర్‌వేర్ దివాలా




- ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం
- అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు
- తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు
- రూ.10వేల కోట్ల రుణ భారం


న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంక్‌రప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంక్‌రప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండికొట్టాయి.

### 80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

### పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కన్సల్టెంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.




### భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

*'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'*
*-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో*

## హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్



హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుట్‌లెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్లా బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్లా బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2-3మూడేండ్లలో మరో 3-4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

## సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హామ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

## హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

## దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్
- దసరా తర్వాత కోర్సులు ప్రారంభం



స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, వర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర్డు సూచనప్రాయంగా వెల్లడించింది. తొలి ఏడాది 2వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, బోర్డు కో చైర్మన్ శ్రీని రాజు, సభ్యులు దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్పెయిన్ రాయబారి జువాన్ ఆంటోనియో మార్చ్ పుజోల్ గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై సీఎంను అభినందించారు. స్పెయిన్‌ను సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు.

## భారత్‌పై ఫెడ్ ప్రభావమెంత!

### అర శాతం వడ్డీరేట్ల కోతపై భిన్నాభిప్రాయాలు

ముంబై, సెప్టెంబర్ 19: వడ్డీరేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల మీద ఆ ప్రభావం ఎంతన్నదానిపై నిపుణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దేశీయ ఎక్స్‌పర్ట్స్ పెట్టుబడులు పెరుగుతాయంటుంటే.. మరికొందరు ఈక్విటీలపై రాబడులు తగ్గుతాయని, బంగారం ధరలు పెరుగవచ్చని అభిప్రాయపడుతున్నారు. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ.. బెంచ్ మార్క్ రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 4.75-5 శాతంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. మునుపు ఇది 5.25-5.50 శాతంగా ఉండేది. గాడి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించేందుకు వరుసగా 14 నెలలపాటు 20 ఏండ్ల గరిష్ఠ స్థాయిలోనే కీలక వడ్డీరేటును అగ్రరాజ్య సెంట్రల్ బ్యాంక్ ఉంచింది. 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ఊహించిందే. బంగారం ధరల్లో పెరుగుదలకు, ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులపై లాభాల తరుగుదలకు ఈ నిర్ణయం దారితీయవచ్చు' అని పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు సంజీవ్ అగర్వాల్ అంచనా వేస్తున్నారు. అలాగే ఫెడ్ నిర్ణయంతో పెట్టుబడులన్నీ స్టాక్ మార్కెట్ల నుంచి పసిడి వైపునకు మళ్లీ ధరలు కొత్త రికార్డులకు చేరవచ్చని కామా జ్యుయెల్లరీ ఎండీ కొలీన్ షా అభిప్రాయపడ్డారు. అయితే భారత్ వంటి దేశాల్లో సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించడానికి ఫెడ్ రిజర్వ్ మార్గం సుగమం చేసిందని బిజ్2క్రెడిట్ సీఈవో రోహిత్ అరోరా అంటున్నారు. వచ్చే నెల ద్రవ్యసమీక్షలో రెపోరేటు తగ్గవచ్చని చెప్తున్నారు.

## రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టండి : తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ ఆహార సమ్మిట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలతో ఆయన సమావేశమై..రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు భారీగా అవకాశాలున్నాయని సూచించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులు, ప్రభుత్వం నుంచి అందించే సహకారాన్ని వివరించారు. అంతకు ముందు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన ఆయన.. పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.